క్లుప్తంగా

నేడు పాలిసెట్ నమూనా పరీక్ష

మాకవరపాలెం: తామరం అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో పాలిసెట్-2025 నమూనా పరీక్ష శనివారం నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ మోహన్ రావు తెలిపారు. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభం అవుతుందన్నారు. విద్యార్థులు పాయింట్ బాల్‌పెన్, పెన్సిల్, ఎరేజర్‌తో హాజరు కావాలన్నారు. ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.2 వేలు, రూ.1500 బహుమతి అందజేస్తామన్నారు.

హార్టికల్చర్ అసిస్టెంట్ మృతికి సంతాపం

మాకవరపాలెం: చెట్టుపై నుంచి పడి మృతి చెందిన హార్టికల్చర్ అసిస్టెంట్ పైల రాజేష్‌కు అధికారులు, తోటి సిబ్బంది సంతాపం తెలియజేశారు. మండలంలోని జి.వెంకటాపురం సచివాలయంలో హార్టికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రాజేష్ శుక్రవారం స్వగ్రామం అన్నవరంలో చెట్టుపై నుంచి పడి మృతి చెందాడు. రాజేష్ మృతికి ఎంపీడీవో సీతామహాలక్ష్మి, అన్ని సచివాలయాల వ్యవసాయ, ఉద్యాన విభాగాలతోపాటు ఇతర సచివాలయ సిబ్బంది సంతాపం తెలిపారు.

మోదమ్మ ఆలయ చైర్మన్‌కు సత్కారం



అప్పలరాజును సత్కరిస్తున్న ఆటో, మోటార్ యూనియన్ సభ్యులు

మాడుగుల: మోదకొండమ్మ ఆలయ చైర్మన్ పుప్పాల అప్పలరాజు స్థానిక మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులవడంతో శుక్రవారం స్థానిక దేవి ఆలయంలో మోటార్, ఆటో యూనియన్ సభ్యులు దుశ్శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అప్పలరాజు మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి నియోజకవర్గంలో కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈదురుగాలులతో వర్షం



కింతాడ వద్ద రోడ్డు మధ్యలో పడిన చెట్టును తొలగిస్తున్న స్థానికులు

కె.కోటపాడు: మండలంలో పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. వేసవి ఉష్ణోగ్రతలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు కురిసిన వర్షంతో సేద తీరారు. ఈదురు గాలులతో కూడిన వర్షం కారణంగా కింతాడ కూడలి సమీపంలో రోడ్డుకు మధ్యలో చెట్టు నేలకొరిగింది. దీంతో విశాఖపట్నం, దేవరాపల్లి ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు అరగంట సేపు ఇబ్బందులు పడ్డారు. స్థానికులు రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. కె.కోటపాడు, కింతాడ, దాలివలస, సింగన్నదొరపాలెం తదితర గ్రామాల్లో వర్షం కురిసింది.


గ్యాస్ ప్రమాదాలపై అవగాహన



అగ్ని ప్రమాదాలపై వివరిస్తున్న ఫైర్ అధికారి రాజేశ్వరరావు

మాడుగుల: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఐదో రోజు స్థానిక భారతి గ్యాస్ స్టాక్ పాయింట్ వద్ద సిబ్బందికి అవగాహన కల్పించారు. గ్యాస్ సిబ్బందితోపాటు వినియోగదారులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రతలు వివరించారు. గ్యాస్ సిలిండర్ల వద్ద పరిసరాలు పరిశుభ్రత తదితర విషయాలుపై ప్రత్యేకంగా వివరించారు. ఫైర్ అధికారి వి. రాజేశ్వరరావు, ఎల్.ఎఫ్.ఎస్. భోగేశ్వరావు, సిబ్బంది పి.వి.ఆర్.మూర్తి, వరహాలరావు పాల్గొన్నారు.

అసంపూర్తిగా కమ్యూనిటీ భవన నిర్మాణం



యడ్లవానిపాలెంలో సగం పనులతో నిలిచిన భవనం

కె.కోటపాడు: యడ్లవానిపాలెంలో అసంపూర్తిగా కమ్యూనిటీ భవన నిర్మాణం దర్శనమిస్తోంది. 2007లో దీని రూ.1.50 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో శ్లాబ్ స్థాయి వరకు నిర్మించారు. మిగిలిన నిర్మాణం పూర్తి చేసేందుకు అదనపు నిధులు అవసరమయ్యాయి. దీంతో భవన నిర్మాణం ప్రారంభించి 18 ఏళ్లు గడుస్తున్నా నేటికీ పూర్తి కాలేదు. దీంతో గ్రామంలో పండగ, ప్రత్యేక సందర్భాల్లో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి అసంపూర్తిగా నిలిచిన కమ్యూనిటీ భవనం నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరుతున్నారు.

మురుగు కూపం.. దుర్గంధ భరితం

- చెరువు నిండా వ్యర్థాలు
- రేయింబవళ్లు దోమలు స్వైరవిహారం
- విష జ్వరాలతో దళితవాడ వాసులు
- దేవరాపల్లి పంచాయతీ పాలకులపై ఆగ్రహం



కంపు కొడుతున్న చెరువుకు ఆనుకొని ఇళ్లు



దేవరాపల్లి దళితవాడలో మురుగుకూపం

దేవరాపల్లి: ఎస్సీ కాలనీలో ముక్కుపుటాలదిరేలా దుర్గంధం వెలువడుతోంది. పాలకులు, అధికారుల ఉదాసీన వైఖరి వల్ల ఇక్కడ వ్యర్థాలతో నిండిన చెరువు నుంచి దుర్వాసన వస్తోంది. ఈ కంపు భరించలేక కాలనీవాసులు నరకయాతన అనుభవిస్తున్నారు. పైగా చెరువు మురుగు కూపంగా మారి దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. రాత్రిళ్లు కంటి మీద కునుకు లేకుండా పోతోందని వాపోతున్నారు.

దేవరాపల్లిలో దళితవాడకు ఆనుకున్న గుల్లేపల్లి వారి చెరువుకు గతంలో ఆయకట్టు ఉండేది. దీని చుట్టూ ఇళ్లు నిర్మించడంతో చెరువు నిరుపయోగంగా మారింది. ఎగువ నుంచి చెరువులోకి నీరు వచ్చి చేరుతుండగా, దిగువన మదుం పని చేయకపోవడంతో నీరు బయటకు పారే పరిస్థితి లేదు. దీంతో చెరువులో చెత్తాచెదారాలతో పాటు వీధి కుక్కలు, పందులు తదితర జంతువుల కళేబరాలను పడేస్తుండటంతో మురుగుకూపాన్ని తలపిస్తుంది. వ్యర్థాలతో నిండిన చెరువుకు ఆనుకొని ప్రభుత్వ పాఠశాలతోపాటు చుట్టూ ఇళ్లలో ప్రజలు నివసిస్తున్నారు.

అధికంగా దోమల బెడద..

తీవ్ర దుర్వాసనతో పాటు దోమలు బెడద అధికంగా అవ్వడంతో స్థానిక ప్రజలు అనారోగాలు బారిన పడుతున్నారు. ప్రతి ఇంటా మలేరియా, డెంగ్యూ తదితర విష జ్వరాల బారిన పడుతున్నామని స్థానిక ప్రజలు ఆందోళన ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం వస్తే చెరువు నిండిపోయి దళిత కాలనీ వాసులు పడే బాధ వర్ణనాతీతం. ఈ చెరువులో మురుగును తొలగించకుంటే తాము ఇక్కడ బతికే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది ముమ్మాటికి పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ తమకు ఈ దుస్థితి దాపురించిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి తమ పట్ల వివక్షను వీడి మురుగుకూపం నుంచి మోక్షం కల్పించాలని స్థానిక కాలనీ వాసులతో పాటు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న డిమాండ్ చేస్తున్నారు.



మురుగు సమస్యపై ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేస్తున్న కాలనీ వాసి

ఇళ్లలో ఉండలేక పోతున్నాం



చనిపోయిన కుక్కలు, పందులు, పిల్లులు, ఇతర జంతువులను పడేస్తున్నారు. దీంతో చెరువు నుంచి వస్తున్న కంపు భరించలేక పోతున్నాం. దీంతో ముక్కు మూసుకుని ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు, పంచాయతీ పాలకులు స్పందించి మురుగుకూపం నుంచి విముక్తి కల్పించాలి.

– వేపచేదు ఎర్రయ్య, దేవరాపల్లి

అనారోగ్యం బారిన పడుతున్నాం



ఇళ్ల మధ్యలో వ్యర్థాలతో కూడిన చెరువు ఉండటంతో తీవ్ర దుర్వాసన వెలువడుతోంది. రేయింబవళ్లు తేడా లేకుండా దోమలు విపరీతంగా కుడుతున్నాయి. దీంతో అనారోగ్యం బారిన పడుతున్నాం. పిల్లలు సైతం విష జ్వరాలు బారినపడుతున్నారు. అధికారులు స్పందించి చెరువులోని కుళ్లు బయటకు పోయేలా చర్యలు తీసుకోవాలి.

– గొటివాడ పద్మ, దేవరాపల్లి

పూర్తిస్థాయిలో మురుగు తొలగిస్తాం



చెరువు పరిసరాల్లో కొంత మేర చెత్తా చెదారాలను తొలగించాం. చెరువు సరిహద్దులను నిర్దేశించేందుకు సర్వే చేపట్టాలని రెవెన్యూ అధికారులకు సూచించాం. చెరువు గర్భంలో మురుగునీటిని పూర్తిస్థాయిలో తొలగించేందుకు చర్యలు చేపడతాం. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– కె.సుధాకర్‌బాబు, పంచాయితీ సెక్రటరీ, దేవరాపల్లి

మోడల్ ప్రైమరీగా ఎం. కోడూరు పాఠశాల

మాడుగుల రూరల్: ఇప్పటివరకు ప్రీ ప్రైమరీ (1, 2 తరగతులు)కి పరిమితమైన ఎం. కోడూరు ప్రాథమిక పాఠశాలను మోడల్ ప్రైమరీగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని హెచ్‌ఎం పి. శ్రీనివాసరావు, స్కూలు కమిటీ చైర్మన్ వి. కిశోర్ శుక్రవారం తెలిపారు. ఈ మేరకు పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలని గ్రామంలో ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. పాఠశాలలో ఐదుగురు ఉపాధ్యాయులతోపాటు, ఆంగ్ల బోధన, డిజిటల్ తరగతులు, ఇంటర్నెట్ సదుపాయం ఉందని తెలిపారు.

24 నుంచి కరాటే శిక్షణ

దేవరాపల్లి: స్థానిక ఉషోదయ స్కూల్ ప్రాంగణంలో ఈ నెల 24 నుంచి జూన్ 13వ తేదీ వరకు కరాటే శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు సీనియర్ కరాటే కోచ్ గెడ్డం నగేష్ తెలిపారు. ఈ శిక్షణ తరగతులను రోజూ ఉదయం 6:30 నుంచి 7:30 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. ఆడపిల్లల ఆత్మ రక్షణ కోసం కరాటే నేర్పించాల్సిన అవసరం తల్లిదండ్రులకు ఉందన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 9542293555, 9182856530 సంప్రదించాలన్నారు.

పూత దశలో బెండ సాగు



గవరపాలెంలో బెండ పంట

కె.కోటపాడు: గ్రామాల్లో బెండ పంట ప్రస్తుతం పూతదశకు చేరుకుంది. 80 ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. ఎకరా పొలంలో దుక్కులు, విత్తనాలు, సస్యరక్షణ చర్యలకు పెట్టుబడులు కింద రూ.20 వేలు వెచ్చించాల్సి వస్తుందని రైతులు తెలుపుతున్నారు. పది రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలు పంటకు మేలు చేసినట్లు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

సారా తయారీ కేంద్రాలపై ఉక్కుపాదం

- తీరుమార్చుకోకపోతే పీడీ యాక్టు
- ఎక్సైజ్ సీఐ సునీల్ కుమార్



నర్సీపట్నం: స్థానిక ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలోని నర్సీపట్నం, రోలుగుంట, కోటవురట్ల, మాకవరపాలెం మండలాల్లో సారా తయారీ, విక్రయాలు, రవాణాపై విస్తృతంగా దాడులు చేపడుతున్నామని సీఐ కె. సునీల్ కుమార్ తెలిపారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా సారా తయారీ స్థావరాలపై నిరంతరం దాడులు చేస్తున్నామన్నారు. సారా ప్రభావిత గ్రామాలను కేటగిరీల వారీగా విభజించామన్నారు. కేటగిరీ(ఎ) గ్రామంలో 6 కేసులు, ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశామన్నారు. 34.5 లీటర్ల సారా, 3,600 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం చేశామన్నారు. కేటగిరీ(బి) గ్రామాల్లో నాలుగు కేసుల్లో నలుగురు నిందితులను అరెస్టు చేసి, 21 లీటర్ల సారా, 320 లీటర్ల బెల్ల ఊటను ధ్వంసం చేశామన్నారు. కేటగిరీ (సి) గ్రామాల్లో మూడు కేసుల్లో నలుగు నిందితులను అరెస్టు చేశామన్నారు. 8 లీటర్ల సారా, 600 లీటర్లు బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. సాధారణ గ్రామాల్లో 14 కేసుల్లో 15 మంది నిందితులను అరెస్టు చేసి, 104 లీటర్ల సారా, 6,520 లీటర్లు బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. 54 మందిపై బైండోవర్ కేసులు పెట్టామన్నారు. బైండోవర్ కేసు ఉండి కూడా సారా విక్రయం, తయారీ, రవాణా చేస్తూ పట్టుబడితే రూ.2 లక్షలు అపరాధ రుసుం విధిస్తామన్నారు. అయినా తీరు మార్చుకోకపోతే నాలుగైదు సారా కేసులు నమోదైతే వారిపై పీడీ యాక్టు ప్రయోగిస్తామని హెచ్చరించారు.

అంబేడ్కర్ విగ్రహానికి స్థలం కేటాయించాలి



స్థలం కేటాయించాలని కోరుతున్న అంబేడ్కర్ యువజన సంఘం ప్రతినిధులు

రావికమతం: మండలంలోని మత్రివలసలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని గ్రామ అంబేడ్కర్ యువజన సంఘం ప్రతినిధులు, దళితులు కోరుతున్నారు. ఎస్సీ కాలనీకి చేరువలో రోడ్డు పక్కన ఖాళీ స్థలం ఉందన్నారు. ఆ స్థలం కేటాయిస్తే విరాళాలు వేసుకుని అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటామని సంఘం ప్రతినిధులు నక్కా సత్యనారాయణ, రాంబాబు, శ్రీను, సత్యనారాయణ, రాజు, రమణ కోరారు. స్థలం కేటాయింపు విషయమై గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ పెద్దలను కలిసి తహసీల్దారుకు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు ఎంతో మేలు

జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లచ్చన్న



రైతులకు సబ్సిడీపై నవధాన్యాల విత్తనాలు పంపిణీ చేస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లచ్చన్న

చోడవరం: ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల రైతులకు మంచి పంట దిగుబడి వస్తుందని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లచ్చన్న తెలిపారు. చాకిపల్లి గ్రామంలో సర్పంచ్ పోతల జానకీప్రసాద్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. తొలకరి వర్షాలకు ముందే ప్రకృతి వ్యవసాయం విధానంలో భూమిని సంరక్షిస్తే ఏడాదంతా పంటకు మేలు చేస్తుందని సూచించారు. పంటకు కావలసిన సూక్ష్మ, స్థూలపోషకాలు అందుబాటులోకి వస్తాయన్నారు. నవధాన్యాలు సాగుచేయడం వల్ల పశువులకు మంచిన పోషాకారం లభివస్తుందన్నారు. నేల గుల్లబారి వానపాములు అభివృద్ధి చెందుతాయని, నేలలో నీటినిలువ సామర్థ్యం పెరుగుతుందన్నారు. మిశ్రమ పంటలు వేయడం వల్ల రైతులకు అదనపు ఆదాయం వస్తుందన్నారు. చోడి పంట ఎంతో లాభదాయకమని ఎక్కువగా సాగు చేయడం మంచిదని స్టేట్ రిసోర్స్ పర్సన్ దేముళ్లు తెలిపారు. ఈ సందర్భంగా రైతులకు సబ్సిడీపై అపరాలు, నవధాన్యాల విత్తనాలు అందజేశారు. ఎన్ఎఫ్ఏ నాగమణి, చిన్న, నాయుడుబాబు, కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మంచినీరు ఇవ్వండి మహాప్రభో?

అజేయపురం గిరిజనులు ఖాళీ బిందెలతో నిరసన



ఖాళీ బిందెలతో వినూత్నంగా నిరసన తెలుపుతున్న గిరిజనులు

రావికమతం: తాగడానికి మంచినీరు ఇవ్వండి మహాప్రభో అంటూ చీమలపాడు పంచాయతీ అజేయపురం గ్రామానికి చెందిన గిరిజనులు ఖాళీ బిందెలతో శుక్రవారం వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో 30 కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరికి తాగునీటి సౌకర్యం కోసం 2019లో 15 ఆర్థిక సంఘం నుంచి రూ.8.40 లక్షలతో వాటర్ స్కీం ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో 15 రోజుల నుంచి విద్యుత్ సరఫరా లేకపోవడంతో మంచి నీటికి ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఈ నెల 15వ తేదీన వాటర్ ట్యాంక్‌పై ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి 16న పంచాయతీ కార్యదర్శి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఆ గ్రామానికి వెళ్లగా, తక్షణమే విద్యుత్ కనెక్షన్ ఇప్పించాలని దరఖాస్తు చేసుకున్నా నేటికీ ఆ శాఖ అధికారులు స్పందించలేదు. గ్రామం నుంచి మూడు మైళ్ల దూరంలో ఎర్రకొండ గుంతల్లో కావిడి నీళ్లు తెచ్చుకుని తాగుతున్నారు. దీనివల్ల తరుచూ విష జర్వాలు వస్తున్నాయని గిరిజనులు వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి కనెక్షన్ ఇవ్వాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు పాంగి చంద్రయ్య, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కే గోవిందరావు కోరుతున్నారు.

మానవుల రక్షణకే యేసు మరణం



శిలువ భుజానమోస్తూ వేషధారణ చేసిన భక్తులు




మాట్లాడుతున్న పాస్టర్ విక్టర్‌పాల్



చంద్రయ్యపేటలో గుడ్ ఫ్రైడే కార్యక్రమంలో క్రైస్తవులు



ప్రదర్శనలో వేషధారణలో విద్యార్థులు



గుడ్ ఫ్రైడే విశిష్టత చెబుతున్న పాస్టర్లు

మాకవరపాలెం: మానవుల రక్షణ కోసమే యేసు క్రీస్తు మరణించినట్టు కొండల అగ్రహారం ఇమ్మానుయేలు సంస్థ డైరెక్టర్ బిషప్ కె.జీవన్‌రాయ్ తెలిపారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా మాకవరపాలెం, రాచపల్లి, తామరం, కొండల అగ్రహారం, తదితర గ్రామాల చర్చిల్లో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా గుడ్ ఫ్రైడే విశిష్టతను పాస్టర్లు క్రైస్తవులకు వివరించారు. సాయంత్రం మాకవరపాలెంతోపాటు పలు గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. పాస్టర్లు టి.వి.రత్నం, విక్టర్‌పాల్, కిరణ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు: సకల జనులకు మంచి చేకూర్చేందుకు క్రీస్తు జన్మించినట్లు చంద్రయ్యపేట పాస్టర్ ఎస్.దేవకుమార్ తెలిపారు. క్రైస్తవ ప్రార్థనా మందిరంలో గుడ్ ఫ్రైడే నిర్వహించారు. వి.సంతపాలెం క్రైస్తవ ప్రార్థనా మందిరంలో రెవరెండ్ మోజేష్ ప్రార్థనలు చేశారు. క్రైస్తవులు యేసుక్రీస్తుపై గీతాలను ఆలపించారు.

చోడవరం: గుడ్‌ఫ్రైడే వేడుకలు భక్తిశ్రద్ధలతో క్రైస్తవులంతా శుక్రవారం జరుపుకొన్నారు. ఏసుక్రీస్తు మరణానికి సంబంధించిన ఘట్టాలను తెలియజేస్తూ వేషధారణలతో, భారీ ప్రదర్శన చేశారు. గాంధీ గ్రామం ఆర్సీఎం చర్చి నుంచి ప్రారంభమైన ప్రదర్శన చోడవరం పట్టణ పురవీధులు, మెయిన్‌రోడ్డు మీదుగా నిర్వహించారు. ఏసుక్రీస్తు రూపంలో భక్తులు వేషం ధరించి శిలువను మోయడం, ఆయనను రాజభటులు కొడుతూ చిత్రహింసలకు గురిచేయడం వంటి ఘట్టాన్ని ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో వందలాది మంది మహిళలు, పిల్లలు, చర్చి ఫాదర్లు పాల్గొన్నారు. ఇదిలావుండగా గుడ్ ఫ్రైడే సందర్భంగా మండలంలో అన్ని చర్చిల్లోనూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చోడవరం, గోవాడ, వెంకన్నపాలెం, గాంధీగ్రామం, గౌరీపట్నం, దామునాపల్లి, గవరవరం, లక్కవరం గ్రామాల్లో బాప్టిస్టు, లూదరన్, కేథలిన్ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

దేవరాపల్లి: కాశీపురం సియోను ప్రార్థనా మందిరంలో శుభ శుక్రవారం ఆరాధన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నిస్సీ మినిష్టర్, వ్యవస్థాపక అధ్యక్షుడు టైటస గొర్లె దంపతులు నడిపించారు. దేశ శాంతి కోసం ప్రార్థనలు చేశారు. అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

మాడుగుల: స్థానిక ఆర్‌సీఎం చర్చిలో శుభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రార్థనలు నిర్వహించారు. విశ్వాసులు పాల్గొన్నారు.

వేసవి దుక్కులు ప్రారంభం



వీరనారాయణంలో దున్నిన దుక్కు

మాడుగుల రూరల్: వారం రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలతో రైతులు వేసవి దుక్కులకు ప్రారంభించారు. దీనిలో భాగంగా గ్రామాల్లో కార్శి చెరకు తోటలతోపాటు అపరాల పంట భూములను ఖరీఫ్ వరినారు మడులు వెయడానికి గాను దుక్కులు దున్నుతున్నారు. వేసవి దుక్కులతో రైతులు బిజీ బిజీగా ఉన్నారు. జూన్ మొదటి వారంలో లేదా రెండో వారంలో ఖరీఫ్ వరి విత్తనాలు వెయనున్నారు. దీనికి వ్యవసాయ శాఖ సమాయత్తమవుతుంది. మండలంలో 13 వేల ఎకరాల్లో ఖరీఫ్ వరి పంట వెయడానికి లక్ష్యంగా పెట్టుకున్నారు. మండలంలో పల్లపు, మెట్ట భూముల్లో వరి విస్తీరణం పెరగనున్నది.

పేలుడు సామగ్రి విక్రయిస్తే చర్యలు

- గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి
- నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు



పేలుడు సామగ్రి విక్రయ కేంద్రంలో స్టాకు వివరాలను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నాతవరం: నిబంధనలు ఉల్లఘించి పేలుడు సామగ్రిని విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు హెచ్చరించారు. ఆయన శుక్రవారం స్థానిక అయ్యప్ప పేలుడు సామగ్రి విక్రయ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీలు చేశారు. మందుగుండు సామగ్రి విక్రయించే కేంద్రంలో రికార్డులను పరిశీలించి తగు జాగ్రత్తలు సూచించారు. ముందస్తు ప్రమాద నివారణ జాగ్రత్తలు చేపట్టకపోయినా చర్యలు ఉంటాయన్నారు. తర్వాత పోలీసు స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి మండలంలో ప్రధాన సమస్యలను ఎస్ఐ సిహెచ్. భీమరాజును అడిగి తెలుసుకున్నారు. పోలీసు స్టేషన్‌కు నూతనంగా రూ.2.50 కోట్లతో నిర్మించిన భవనాన్ని పరిశీలించారు. త్వరలో భవనం ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని ఎస్ఐను ఆదేశించారు. ఏజెన్సీ నుంచి గంజాయి తరలించే మార్గాలను క్షుణంగా పరిశీలించారు. నర్సీపట్నం – తుని ఆర్‌అండ్‌బీ రోడ్డులో తాండవ జంక్షన్ వద్ద కొన్ని వాహనాలను తనిఖీలు చేశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ గంజాయి రవాణా చేయడంపై ప్రత్యేకంగా నిఘా పెట్టామన్నారు. కొయ్యూరు, చింతపల్లి మండలాల నుంచి నాతవరం మండలం మీదుగా కాకినాడ జిల్లా తుని రైల్వే స్టేషన్, హైవే ప్రాంతాలకు లింకు రోడ్లపై వాహనాలు తనిఖీలు ముమ్మరంగా చేయాలని ఎస్ఐను ఆదేశించారు. నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్. రేవతమ్మ పాల్గొన్నారు.

ఉపాధి బిల్లులు చెల్లించాలని వేడుకోలు



గొండుపాలెంలో చేతుల జోడించి ఉపాధి బకాయిలను విడుదల చేయాలని కోరుతున్న దృశ్యం

కె.కోటపాడు: ఉపాధి పనులు చేపట్టి 13 వారాలు అవుతున్నా వేతనదారులకు చెల్లింపులు చేపట్టకపోవడం అన్యాయమని సీపీఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు అన్నారు. కె.కోటపాడు, గొండుపాలెం గ్రామాల్లో ఉపాధి వేతనాలు రాకపోవడంపై వేతనదారులతో కలిసి శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వేతన బకాయిలను చెల్లించాలని ఉపాధి వేతనదారులు చేతుల జోడించి ప్రభుత్వాన్ని కోరారు. 13 వారాలకు ఉపాధి వేతనదారులకు చెల్లించాల్సిన బకాయిలు జిల్లాలో సుమారు రూ.55 కోట్లు ఉన్నాయని ముత్యాలనాయుడు అన్నారు. పెరిగిపోతున్న నిత్యావసర సరుకుల ధరల నేపథ్యంలో ఉపాధి వేతనదారులకు రోజువారి వేతనానికి తోడు అదనంగా రూ.7 పెంచామని చెప్పడం అన్యాయమన్నారు. ఉపాధి పనులు కల్పించడంలో జిల్లా ప్రథమ స్థానంలో ఉందని చెబుతున్న జిల్లా కలెక్టర్‌కు పనులు చేసినా డబ్బులందక కూలీలు పడుతున్న ఇబ్బందులు పట్టవా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉపాధి బకాయిలను చెల్లించాలని కోరారు.